APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth

విలేకరులు కావలెను
స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు
కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు మండల రిపోర్టర్స్ కావలెను.
స్ఫూర్తి పత్రిక Voice of Truth
గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.
ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.
ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక : 169 | పేజీలు : 04 వెల రూ. 2/- | బుధవారం 12-08-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 169 | PAGES : 04 PRICE : 2 | WEDNESDAY 12 AUGUST 2026

## చంద్రుడిపై శాశ్వత స్థావరం.. భారత్‌ను భాగస్వామిగా ఆహ్వానించిన నాసా

- మూన్ బేస్ కార్యక్రమంలో చేరాలని నాసా ఆహ్వానం
- చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద స్థావరం ఏర్పాటుకు ప్రణాళిక
- చంద్రయాన్-3 విజయంతో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు




చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలన్న అమెరికా ప్రణాళికలో భారత్ భాగస్వామి అయ్యే అవకాశం ఉంది. నాసా ప్రతిపాదించిన 'మూన్ బేస్' కార్యక్రమంలో చేరాలని ఇస్రోను అమెరికా ఆహ్వానించింది. బెంగళూరులో ఆగస్టు 5, 6 తేదీల్లో జరిగిన భారత్-అమెరికా సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఈ ఆహ్వానం అందింది. మిగతా 2లో

## ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారింది

- అమెరికా ఆర్థికమంత్రి వ్యాఖ్యలపై మండిపడ్డ ఇరాన్
- లక్ష్యాలను సాధించడంలో విఫలమైనప్పుడల్లా ఆంక్షల అస్త్రాలను ప్రయోగిస్తోందని మండిపాటు
- ఆంక్షల బెదిరింపులతో తమను లొంగదీసుకోలేరని వ్యాఖ్య



ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలపై, ముఖ్యంగా తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు విధించడం అమెరికాకు ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిపోయిందని మిగతా 2లో

## ఆగస్టు 15 తర్వాత ఉద్యమ కార్యాచరణ తీవ్రం



- పార్టీనేతల మధ్య సయోధ్య.. సర్జరీ పూర్తయింది, లంచ్‌లు, డిన్నర్‌లు కూడా జరిగాయి
- సినిమా పిచ్చి ఉన్నవారు కొంతమంది జనసేనలోకి పోతున్నారు
- మీడియా చిట్‌చాట్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

ఆగస్టు 15 తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ వైఘుల్యాలు, తప్పులు, హామీల అమల్లో వెనుకడుగు, ఫీజు బకాయిలు తదితరాలపై ఉద్యమ కార్యాచరణ తీవ్రం చేయనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మిగతా 2లో

## పేద పిల్లల కలలకు చిరునామాగా..

# యంగ్ ఇండియా స్కూల్స్

- పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలి
- అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్..
- హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.
- మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు.
- ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు.
- 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.
- మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు.
- పాతబస్తీ మెట్రో పనులపై సంబంధిత అధికారులతో సీఎం మంగళవారం MCRHRDలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు

### మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు. ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పాతబస్తీ మెట్రో పనులపై సంబంధిత అధికారులతో సీఎం మంగళవారం MCRHRDలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని మిగతా 2లో

## తెలంగాణను హెచ్‌ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



- హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనకు బుధవారం భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.
- ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.
- హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనకు బుధవారం భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆగస్టు 12 నుంచి మిగతా 2లో

## 'రేవంత్ సోదరులకు కోట్ల రూపాయలు ఎలా వస్తున్నాయి?

### రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి

- సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారని కేటీఆర్ ఆరోపణ
- టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ
- కేవలం లక్ష రూపాయల మూలధనంతో కంపెనీ ఏర్పాటు చేశారని వెల్లడి



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి సోదరులకు కోట్ల రూపాయలు ఎలా వస్తున్నాయంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మంగళవారం మిగతా 2లో.

## లీడర్లకు లేని టియర్ గ్యాస్ కేవలం స్టూడెంట్స్‌పైనే ఎందుకు?



జార్ఖండ్‌లో విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ, టియర్ గ్యాస్ ఉపయోగించడాన్ని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రంగా ఖండించారు.

రాజకీయ పార్టీలు ఆందోళనలు చేసినప్పుడు టియర్ గ్యాస్, లాఠీచార్జ్ ఎందుకు చేయడం లేదని, కేవలం విద్యార్థులపై మాత్రమే ఇలాంటి చర్యలు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు.

జార్ఖండ్‌లో విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ, టియర్ గ్యాస్ ఉపయోగించడాన్ని మిగతా 2లో

## ఈ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలి

### కొడుకును కాపాడుకోవడం కోసం చరిత్ర హీనులవుతారా?

- డీఎస్సీ అక్రమాలపై విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, ప్రజల ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పడం లేదు?
- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆగ్రహం
- డీఎస్సీ పేపర్ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి



'డీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి. ఈ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలి. మిగతా 2లో

## 'సీబీఐ విచారణ జరపాలి.. లోకేశ్ రాజీనామా చేయాలి"



- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలని మాజీ మంత్రి ఆర్కే రోజా డిమాండ్ చేశారు.
- మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని చెప్పారు.
- నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

నగరి: డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలని మాజీ మంత్రి ఆర్కే రోజా డిమాండ్ చేశారు. మిగతా 2లో

## జాతీయ సగటును మించిన

# ఏపీ వృద్ధి రేటు

- సామాన్యుడిపై ధరల భారం వద్దు.. ఎల్ నినోను అధిగమించి 15 శాతం వృద్ధి సాధించాలి: సీఎం చంద్రబాబు
- ఏపీ ఆర్థిక వృద్ధిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 2025-26 రెండో త్రైమాసికంలో 10.7శాతం వృద్ధిరేటు నమోదు
- ఎల్ నినో ప్రభావం, ధరల పెరుగుదలపై సీఎం ఆందోళన
- 15 శాతం వృద్ధిరేటు సాధించాలని అధికారులకు కొత్త లక్ష్యం
- సామాన్యుడిపై ధరల భారం పడకుండా కమిటీ ఏర్పాటుకు సూచన
- ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటూ సానుకూల వృద్ధిరేటుతో దూసుకెళ్తోంది.
- గడిచిన రెండేళ్లుగా జాతీయ సగటును మించి ప్రగతి సాధిస్తున్న ఏపీ, 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. అయితే, ఈ సానుకూల వాతావరణంలోనూ ఎల్ నినో రూపంలో పొంచివున్న ముప్పును ముందుగానే పసిగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దానిని అధిగమించి రాష్ట్రాన్ని 15 శాతం వృద్ధిరేటు పథంలో నడిపించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### ఆర్థిక సమీక్షలో సీఎం కీలక ఆదేశాలు!




ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటూ సానుకూల వృద్ధిరేటుతో దూసుకెళ్తోంది. గడిచిన రెండేళ్లుగా జాతీయ సగటును మించి ప్రగతి సాధిస్తున్న ఏపీ, 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. అయితే, ఈ సానుకూల వాతావరణంలోనూ ఎల్ నినో రూపంలో పొంచివున్న ముప్పును ముందుగానే పసిగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దానిని అధిగమించి మిగతా 2లో

## విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది



- జార్ఖండ్‌లో ఎస్ఎస్‌సీ పరీక్షలో అవకతవకలు జరిగినట్లు తేలిందని.. ఈ క్రమంలోనే విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు.
- వారిపైనా రబ్బర్ బుల్లెట్స్, లాఠీఛార్జి చేశారన్నారు. జీజీవీ, కాంగ్రెస్ ప్రభుత్వమే అక్కడ నడుస్తోందని చెప్పారు.

జార్ఖండ్‌లో ఎస్ఎస్‌సీ పరీక్షలో అవకతవకలు జరిగినట్లు తేలిందని.. ఈ క్రమంలోనే విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. వారిపైనా రబ్బర్ బుల్లెట్స్, లాఠీఛార్జి చేశారన్నారు. మిగతా 2లో

## చంద్రుడిపై శాశ్వత స్థావరం..

# భారత్‌ను భాగస్వామిగా ఆహ్వానించిన నాసా

చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో మానవులు నివసించే తొలి శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేయాలన్నది నాసా ప్రణాళిక. వ్యోమగాములు అక్కడ నివసించడంతో పాటు పరిశోధనలు చేయనున్నారు. ఇందుకోసం మానవ సహిత, మానవ రహిత మిషన్ల ద్వారా అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా ఏర్పాటు చేయనున్నారు.చంద్రుడి దక్షిణ ధ్రువానికే నాసా ప్రాధాన్యం ఇస్తోంది. అక్కడ శాశ్వతంగా నీడలో ఉండే కొన్ని ప్రాంతాల్లో మంచు రూపంలో నీరు ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆ నీటిని తాగడానికి, ఆక్సిజన్, రాకెట్ ఇంధనంగా మార్చుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులో అంగారకుడిపై మానవ యాత్రలకు చంద్రుడిని కీలక కేంద్రంగా ఉపయోగించుకోవాలన్నది నాసా లక్ష్యం.చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2023 ఆగస్టులో చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ అక్కడ దిగాయి. ల్యాండింగ్ ప్రాంతానికి 'శివశక్తి పాయింట్'గా పేరు పెట్టారు. నాసా ఇప్పుడు అదే ప్రాంతంలో స్థావరం ఏర్పాటుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇస్రో అనుభవం కీలకంగా మారనుంది.మూన్ బేస్ సహకారం ఆర్టెమిస్ అకార్డ్స్ కింద భారత్-అమెరికా భాగస్వామ్యానికి కొనసాగింపుగా ఉండనుంది. శాంతియుత, పారదర్శక, సుస్థిర అంతరిక్ష అన్వేషణకు ఈ ఒప్పందం మార్గదర్శకంగా ఉంటుంది. 2023 జూన్ 21న భారత్ ఆర్టెమిస్ అకార్డ్స్‌పై సంతకం చేసింది.బెంగళూరు సమావేశంలో అంతరిక్ష పరిశోధనల నుంచి లభించే శాస్త్రీయ సమాచారాన్ని పరస్పరం పంచుకోవడంపైనా చర్చలు ముందుకు తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.భారత్, అమెరికా ఇప్పటికే నిసార్ ఉపగ్రహం ద్వారా భారీ అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నాయి. భవిష్యత్‌లో శాస్త్రీయ పరిశోధనలు, మానవ అంతరిక్ష ప్రయాణ సాంకేతికతపై కలిసి పనిచేయాలని తాజా సమావేశంలో నిర్ణయించారు.భారత్ గగన్‌యాన్ కార్యక్రమంతో మానవ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతోంది. అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, భవిష్యత్తులో చంద్రుడిపై మానవ కార్యకలాపాల వంటి లక్ష్యాలను 'స్పేస్ విజన్ 2047'లో భారత్ నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో నాసా ఆహ్వానం ఇస్రోకు కీలక అవకాశంగా మారనుంది.

## ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారింది

ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంక్షల ద్వారా ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అంటూ అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చేసిన వ్యాఖ్యలపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. దౌత్య మార్గాల్లో అనుకున్న లక్ష్యాలను సాధించడంలో విఫలమైనప్పుడల్లా అమెరికా ఈ ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగిస్తోందని, అవి పనిచేయనప్పుడు మరింత తీవ్రతను పెంచుతూ తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.దశాబ్దాలుగా ఇరాన్ ప్రజలు అమెరికా విధించిన కఠినమైన ఆంక్షలను తట్టుకుని నిలబడ్డారని, కేవలం ఆంక్షల బెదిరింపులతో తమ దేశాన్ని లొంగదీసుకోవడం ఎవరికీ సాధ్యం కాదని బఘాయి స్పష్టం చేశారు. అమెరికా నాయకులు ఈ విపరీత ధోరణిని, చెడు అలవాటును ఇలాగే కొనసాగిస్తే, భవిష్యత్తులో దౌత్యపరమైన సంక్షోభాల నుంచి గౌరవప్రదంగా బయటపడే అవకాశాలను వారే స్వయంగా నాశనం చేసుకుంటారని హెచ్చరించారు.మరోవైపు, ఇరాన్ ప్రభుత్వం ఆంక్షలను అధిగమించడానికి డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ ఆరోపించారు. ఇరాన్ కొనసాగిస్తున్న అక్రమ ఆర్థిక వ్యవస్థలను గుర్తించి త్వరలోనే పూర్తిగా ధ్వంసం చేస్తామని వెల్లడించారు.ఇంకోవైపు, అమెరికాతో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న వేళ ఇరాన్ సైనిక నాయకత్వంలో కీలక నియామకాలు జరిగాయి. దేశ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ తొలిసారిగా మిలిటరీ విభాగంలో ప్రధాన మార్పులు చేశారు. సాయుధ దళాల చీఫ్‌గా మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని, డిప్యూటీ చీఫ్‌గా కియుమర్స్ హైదరీని నియమించారు. అలాగే శక్తివంతమైన ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీని, ఆయన డిప్యూటీగా మోస్తఫా ఇజాదీని బాధ్యతల్లోకి తీసుకువచ్చారు. మొజ్తబా ఖమేనీ నాయకత్వంలో జరిగిన ఈ అత్యున్నత స్థాయి నియామకాలు ప్రాంతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## ఆగస్టు 15 తర్వాత ఉద్యమ కార్యాచరణ తీవ్రం

ఎన్.రాంచందర్‌రావు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలు, విధానాలపై త్వరలోనే పాదయాత్ర, బస్సుయాత్ర ఇతర రూపాల్లో చేపట్టబోయే పోరుబాటపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈనెల 15 తర్వాత 'క్యూర్'పై నిపుణులు, వివిధ వర్గాల ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ జరిపేందుకు వర్క్‌షాప్ నిర్వహిస్తామని చెప్పారు. క్యూర్‌లో పన్నుల విధానం, కార్పొరేటర్ల పాత్ర, పట్టణ ప్రణాళిక, నీరు--మురుగునీటి వ్యవస్థలను వేరు చేయడం వల్ల ఎదురయ్యే సమస్యలు, పన్నుల భారం వంటి ముఖ్యమైన విషయాలపై స్పష్టత కొరవడిందన్నారు.బీజేపీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో రాంచందర్‌రావు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన 'హిల్టుర్, హిల్ట్, హైడ్రా'(త్రీహెచ్)తో రాష్ట్రంలో అభివృద్ధి స్తంభించిపోయిందన్నారు. హైడ్రా సెలక్టివ్‌గా అక్రమ కట్టడాలను ధ్వంసం చేస్తోందని, ఎంఐఎంకు సంబంధించిన వాటి విషయంలో చర్యలేవీ తీసుకోవడం లేదని ఆరోపించారు. 'రేవంత్ వరుణయాగం చేస్తే.. మేము వారు కొట్టుకుపోవాలని వాయుయాగం చేస్తాం'అని నవ్వుతూ ఓ ప్రశ్నకు బదులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ లోపాలు, పాలనా వైఫల్యాలతోనే అధికారులు కోర్టుల వద్ద పదే పదే మొట్టికాయలు తినాల్సి వస్తోందన్నారు. పరిపాలనా వ్యవస్థ దెబ్బతిన్నప్పుడే న్యాయవ్యవస్థ అడుగుపెడుతుందనే నానుడిని నిజం చేస్తూ ప్రస్తుత పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ఈ నెల 14న హైదరాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి వివేకానంద విగ్రహం వరకు తిరంగా యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ నేతల సయోధ్య పూర్తయిందా అన్న ఓ విలేకరి ప్రశ్నకు 'అది అయ్యింది.సర్జరీ తర్వాత పోస్ట్ ఆపరేషన్ కేర్ పూర్తయి లంచ్‌లు, డిన్నర్లు కూడా అయ్యాయి'అని నవ్వుతూ రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. బీజేపీ నుంచి కొందరు జనసేనలో చేరుతున్నారు కదా అని ఓ విలేకరి ప్రశ్నించగా 'సినిమా పిచ్చి ఉన్నవారు కొంతమంది జనసేనలో పోతున్నారు. వెళ్లిన వారిని అడిగితే నేను పవన్ ఫ్యాన్ అని అంటున్నారు. గతంలో ఎందుకు వెళ్లలేదు అని అడిగితే అప్పుడు జనసేన తెలంగాణలో లేదు కాబట్టి వెళ్లలేదు అని అన్నారు. వెళ్లే వారిని అడ్డుకోలేం కదా'అని రాంచందర్‌రావు బదులిచ్చారు.

## తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రేపు ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగనుందని మంత్రి తెలిపారు. సుమారు 1500 మంది ర్యాలీలో పాల్గొననున్నట్లు తెలిపారు.హెచ్ఐవీ బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. హెచ్ఐవీ ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్' నినాదంతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కాగా.. రేపు ఈ ర్యాలీలో మంత్రులు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించనున్నారు. కాలేజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ర్యాలీలో పాల్గొననున్నారు.

## 'సీబీఐ విచారణ జరపాలి.. లోకేశ్ రాజీనామా చేయాలి"

మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని చెప్పారు. నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.మెగా డీఎస్సీలో అక్రమాలకు బాధ్యతవహిస్తూ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలంటూ నగిరి నియోజక వర్గంలో ఆర్కే రోజా ఆధ్వర్యంలో నిరసన రాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పుత్తూరు పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రోజా మాట్లాడారు."ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మొదటి ఉద్యోగ నోటిఫికేషన్ ఇది. ఆ తర్వాత జరిగిన అవకతవకతల గురించి చూశాం. క్వశ్చన్ పేపర్ తయారు చేసే నవీన్ అనే వ్యక్తికి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. సో అక్కడే మీకు పేపర్ లీకేజ్ అయింది అనేది అందరికీ అర్థమయింది. పేపర్ లీకేజ్ కాకపోతే ఫస్ట్ ర్యాంక్ వచ్చిన నవీన్ కి ఎందుకు ఉద్యోగం ఇవ్వలేదు? రెండో ర్యాంక్ నుంచి ఎందుకు ఇచ్చారు అనేది వాళ్లు చెప్పాలి. రెండోది స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇవ్వడం. ఎప్పుడు కూడా స్పోర్ట్స్ కోటాలో ఎగ్జామ్ పెట్టి, ఆ ఎగ్జామ్ ద్వారా సర్టిఫికేట్లు వెరిఫై చేసే ఉద్యోగాలు ఇస్తారు. కానీ వీళ్లు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాక దొంగ జీవోలు తీసుకొచ్చారు. పోస్ట్‌లను అమ్ముకునేందుకు దాని ద్వారా డబ్బులు దోచుకోవడానికి ఈ జీవోలని వాడారు" అని వ్యాఖ్యానించారు.

## విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది

జీజీవీ, కాంగ్రెస్ ప్రభుత్వమే అక్కడ నడుస్తోందని చెప్పారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు తెలిసిన వెంటనే పరీక్ష రద్దు చేశామని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేశారని వెల్లడించారు. బీజేపీ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న తేడా ఇదే అని చెప్పుకొచ్చారు.జార్ఖండ్‌లో ఎస్ఎస్‌సీ పేపర్ లీక్ వల్ల ఎంతో మంది యువత జీవితం రోడ్డుపాలవుతోందని మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. కేంద్రంలో తప్పు జరిగిందని.. వెంటనే దాన్ని కరెక్ట్ చేశామని అన్నారు. రాహుల్ గాంధీ పిరికివారని.. అందుకే పార్లమెంట్‌కు రాకుండా పారిపోతున్నారని విమర్శించారు. పేపర్ లీక్‌పై చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. వైఎస్సార్ హయాంలో జరిగిన పేపర్ లీకేజీలపై జగన్, షర్మిల ముందుకు రావాలన్నారు. వైసీపీ దిక్కుతోచని స్థితిలో ఉందంటూ వ్యాఖ్యానించారు. డీఎస్సీ పూర్తి పారదర్శకంగా జరిగిందని.. ఏం చేయాలో తెలియక వైసీపీ కావాలని రాజకీయం చేస్తోందని మండిపడ్డారు.క్రీడా కోటాలో ఉద్యోగాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చిందని బీజేపీ ఏపీ అధ్యక్షుడు అన్నారు. వైసీపీ చేస్తున్న నిరసనలను ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని తెలిపారు.

# పేద పిల్లల కలలకు చిరునామాగా.. యంగ్ ఇండియా స్కూల్స్

దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు.

సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్..

'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు హైదరాబాద్ మెట్రోరైల్ రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ పై సీఎం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో పనులపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలు పెట్టాలని తెలిపారు. మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

అదనపు బోగీలపై..

హైదరాబాద్ మెట్రోకు రోజురోజుకు రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణీకుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైల్?కు అదనపు బోగీలను జత చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి మెట్రో రైల్ కోచెస్?ను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మెట్రో ఫేజ్-2 లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.డిసెంబర్?లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మిట్ నిర్వహణకు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి ఏర్పాట్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపార రంగంలో వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్?లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా తెలంగాణ లో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది నిర్వహించిన సమ్మిట్‌లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎస్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సగటును మించిన ఏపీ వృద్ధి రేటు

రాష్ట్రాన్ని 15 శాతం వృద్ధిరేటు పథంలో నడిపించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులు సమర్పించిన జూలై నెల ఆర్థిక నివేదికపై ఆయన సమీక్ష నిర్వహించారు.

అన్ని రంగాల్లోనూ అద్భుత ప్రగతి

ప్రణాళికా విభాగం నివేదిక ప్రకారం, రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధి రేటు 2023-24లో 6.5 శాతం ఉండగా, 2025-26 నాటికి 9.9 శాతానికి పెరిగింది. ముఖ్యంగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం చొప్పున వృద్ధి సాధించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలుగా నిలిచాయి. పశుసంవర్ధక శాఖలో మాంసం, గుడ్ల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఐటీ, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకున్నాయి. టెక్నాలజీ వినియోగంతో జీఎస్టీ వసూళ్లు 21 శాతం పెరిగి రూ.13,282 కోట్లకు చేరగా, రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ.2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టులు, రూ.60 వేల కోట్ల ఎంఎస్ఎంఈ పెట్టుబడులు గ్రౌండింగ్‌లో మంచి వృద్ధిని కనబరిచాయి.

ఎల్ నినో సవాల్.. సీఎం దిశానిర్దేశం

ఈ ఆర్థిక ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, ఎల్ నినో ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో లోటు వర్షపాతం ఉంది. కృష్ణా నదిలో ప్రవాహాలు లేక శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు నిండలేదు. గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించి ఆదుకున్నాం. భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జీఎస్‌డీపీ పడిపోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి" అని ఆయన సూచించారు.ప్రజలపై ఎలాంటి ధరల భారం పడకుండా చూసేందుకు తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. "సామాన్యుడిపై భారం పడకూడదు. నీటి లభ్యత, ఉత్పత్తులకు విలువ జోడింపు వంటి అంశాలపై తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలి. వాణిజ్య పన్నుల శాఖ మాదిరిగా అన్ని శాఖల్లో టెక్నాలజీని వాడి లక్ష్యాలు సాధించాలి" అని స్పష్టం చేశారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు సిద్ధం చేస్తే లక్ష్య సాధన సులభమవుతుందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి అయ్యే ఉత్పత్తులపై ప్రభావం పడకుండా చూడాలని, మొత్తంగా రాష్ట్రాన్ని 15 శాతం వృద్ధిరేటు దిశగా నడిపించేందుకు అవసరమైన సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ప్రణాళికా విభాగం ఈడీ వీఆర్ అలపర్తి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పురోగతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆసక్తికర గణాంకాలు వెల్లడయ్యాయి. రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు గత రెండేళ్లుగా జాతీయ సగటు కంటే మెరుగైన స్థానంలో కొనసాగుతున్నట్లు సీఎమ్‌కు సమర్పించిన నెలవారీ ఆర్థిక నివేదికలు స్పష్టం చేశాయి.ఆర్థిక సంవత్సరం 2023-24లో 6.5 శాతంగా ఉన్న జీఎస్‌డీపీ వృద్ధి రేటు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి నాటికి గణనీయంగా పుంజుకొని 9.9 శాతానికి చేరుకుందని అధికారులు వివరించారు. రాష్ట్రంలో వివిధ రంగాల పురోగతి మరియు కచ్చితమైన ప్రణాళికల అమలు వల్లనే ఈ స్థాయిలో ఆర్థిక వ్యవస్థ వేగం పుంజుకుందని సమీక్షలో తేలింది.పన్ను వసూళ్లలో కూడా రాష్ట్రం రికార్డు స్థాయి వృద్ధిని నమోదు చేసింది. నివేదిక ప్రకారం జీఎస్టీ (+ూ) ఆదాయం ఏకంగా 21 శాతం వృద్ధితో రూ. 13,282 కోట్లకు చేరుకుంది. వ్యాపార అనుకూల వాతావరణం, సమర్థవంతమైన పన్నుల నిఘా మరియు డిజిటల్ విధానాల అమలు ఈ పెరిగిన ఆదాయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. రాష్ట్రంలో ఉత్పత్తి, సేవలు మరియు వినియోగ రంగాల విస్తరణ జీఎస్టీ ఆదాయంలో స్పష్టంగా కనిపిస్తోందని అధికారులు వివరించారు.అయితే, భవిష్యత్తులో రాబోయే ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల స్థూల ఉత్పత్తులు పడిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ, పరిశ్రమల రంగాలపై ఒత్తిడి పడకుండా వివిధ ప్రభుత్వ శాఖలు పూర్తి సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా వ్యూహాలను అమలు చేస్తూ జాతీయ వృద్ధి రేటును మించి రాష్ట్ర ఆర్థిక ప్రగతిని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని సీఎమ్ చంద్రబాబు స్పష్టం చేశారు.తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి. అలా చేయకపోతే, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. అందుకే చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి" అని స్పష్టం చేశారు. "పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని మేము వాస్తవాలు చెప్పడం వల్లే.. గొడ్డలి పార్టీ మినహా కొన్ని ఇతర పార్టీలకు చెందిన నేతలు కూడా తప్పులు జరగలేదని బహిరంగంగా చెబుతున్నారు.

# 'రేవంత్ సోదరులకు కోట్ల రూపాయలు ఎలా వస్తున్నాయి?

ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విచ్చలవిడి గా వ్యవహరిస్తోంది. సీఎం సోదరులు ఏ హోదాతో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు" అంటూ దుయ్యబట్టారు. "సీఎం సోదరుల వ్యవహారశైలిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం. రాష్ట్రంలో సీఎం రేవంత్ సోదరులకు ప్రత్యేక రూల్స్ ఎందుకు?. సీఎం రేవంత్‌రెడ్డి దోపిడీని ప్రజలకు వివరిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. చదువు రాని రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లుతో కంపెనీలు పెట్టారు. ఆ కంపెనీలో ఒక్క ఎంప్లాయ్ లేరు.. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు కేటాయింపు. 200 కోట్ల విలువ చేసే స్థలాన్ని 7 వేల కోట్లకి కేటాయించారు. మంత్రి శ్రీధర్ బాబు ఆ కంపెనీకి కొండల్ రెడ్డికి సంబంధం లేదని ఎలా చెబుతారు?మీ శాఖలో ఏం జరుగుతుందో శ్రీధర్ బాబుకి తెలియదా? లేక సీఎం ఒత్తిడికి తలొగ్గరా? కొండల్ రెడ్డికి సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ మీటింగ్‌కి ఎలా వెళ్లారు. ఈ భూ కేటాయింపులను వదలం. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయట పెడతాం. 74 లక్షల ఓట్లు తొలగించబోతున్నారనేది ఆందోళనకరం. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాంఅర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తాం. తెలంగాణకి అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా? లేదా స్పష్టం చేయాలి. జలసౌధాలో జరిగే జీఆర్ఎంబీ ఎజెండా మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తాం. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదు" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు.ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు.

# కొడుకును కాపాడుకోవడం కోసం చరిత్ర హీనులవుతారా?

ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.9 వేల కోట్ల బకాయి.. వసతి దీవెన బకాయి వెంటనే చెల్లించాలి. ఇంటింటికీ బాండ్లు ఇచ్చి, మేనిఫెస్టోలో చెప్పినట్టుగా నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి బకాయిలతో కలిపి చెల్లించాలి. ఇంత స్పష్టంగా విద్యార్థులు, యువత, ప్రజలు చంద్రబాబును డిమాండ్ చేస్తుంటే, వాటిని డైవర్ట్ చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేయడం ఎంత వరకు సమంజసం?' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం చంద్రబాబును నిలదీశారు. ప్రజలు అడుగుతున్న డిమాండ్‌లను అంగీకరిస్తారా? లేక కొడుకును కాపాడుకోవడం కోసం చరిత్ర హీనులుగా మిగిలిపోతారా? అని ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీల్లో లక్షలాదిగా విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు, ప్రజలు పాల్గొన్నారని పేర్కొన్నారు. తప్పు చేసిన ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తూ, స్ఫూర్తిదాయకంగా నిలిచారని అభినందించారు. విద్యార్థులు, యువకుల కోసం, వారి భవిష్యత్తు కోసం గత రెండు నెలలుగా అన్ని వర్గాల మద్దతుతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు చేసిన పోరాటాలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు.

10 కార్యక్రమాలకు విశేష మద్దతు

'చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ఉల్లంఘనకు పూనుకున్నారు. పోలీసు బలంతో అణచి వేయాలని చూశారు. నిర్బంధాలు, బెదిరింపులు, నోటీసులను ఖాతరు చేయకుండా, నియంతృత్వానికి ఎదురొడ్డి.. ప్రజలతో కలిసి, లక్షలాది సంఖ్యలో బయటకు వచ్చి గట్టిగా పోరాటం చేశారు. నిర్బంధాలన్నింటినీ ఎదుర్కొంటూ, ప్రతి అడ్డంకినీ అధిగమిస్తూ శాంతియుతంగా ఈ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాం. గడిచిన 74 రోజుల్లో రాష్ట్ర గవర్నర్‌ను కలవడం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నిర్వహించిన 10 కార్యక్రమాలు.. అశేష ప్రజానీకం మద్దతుతో అత్యంత విజయవంతం అయ్యాయి' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెల నుంచి ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

మే 29 -- రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి విభాగం నిరసనలు

జూన్ 1 -- జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసనలు, వినతి పత్రాలు

జూన్ 8, 9 -- నియోజకవర్గ స్థాయి టౌన్ హాల్ సమావేశాలు

జూన్ 12 -- 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిరసన ర్యాలీలు

జూన్ 18 -- రాష్ట్ర గవర్నర్‌ను కలిసి డీఎస్సీపై విచారణ కోరుతూ వినతిపత్రం

జులై 28 -- రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజనుల నిరసన ర్యాలీలు

జులై 31 -- జిల్లా కలెక్టర్లు జేసీలకు వినతులు

ఆగస్టు 3, 4 -- రాష్ట్ర వ్యాప్తంగా రౌండ్ టేబుల్, టౌన్‌హాల్ సమావేశాలు

ఆగస్టు 6, 8 -- నియోజకవర్గాల స్థాయిలో రిలే నిరాహార దీక్షలు

ఆగస్టు 10 -- రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు

ఇంత మంది అడుగుతున్నా నోరు విప్పరా?

ఇన్ని కార్యక్రమాల ద్వారా లక్షల మంది ప్రశ్నించినా చంద్రబాబు నోరు మెదపడం లేదని, లోకేశ్ సమాధానం చెప్పడం లేదని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'డీఎస్సీ పేపర్ లీకేజీ, అక్రమాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ (విద్యా దీవెన), వసతి దీవెన కింద దాదాపుగా రూ.9 వేల కోట్ల బకాయిల చెల్లింపు, ఎన్నికల సమయంలో బాండ్లు ఇచ్చి, మేనిఫెస్టోలో పెట్టి, సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ పేరిట హామీలు, నెలా నెలా రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి.. ఇవేవీ లేవు. నిరుద్యోగ భృతి కింద ఏడాదికి రూ.36 వేల చొప్పున మూడేళ్లకు రూ.1.08 లక్షలు ప్రతి నిరుద్యోగికీ బాకీ పడ్డారు. ఈ బాకీ సహా ఏ డిమాండ్‌పైనా ఇప్పటి వరకు చంద్రబాబు నోరు తెరవలేదు. చంద్రబాబు కుమారుడు లోకేశ్ కూడా ప్రజలు వేస్తున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం లేదు.

# లీడర్లకు లేని టియర్ గ్యాస్ కేవలం స్టూడెంట్స్‌పైనే ఎందుకు?

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రంగా ఖండించారు.రాజకీయ పార్టీలు ఆందోళనలు చేసినప్పుడు టియర్ గ్యాస్, లాఠీచార్జ్ ఎందుకు చేయడం లేదని, కేవలం విద్యార్థులపై మాత్రమే ఇలాంటి చర్యలు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. మంగళ వారం మహారాష్ట్రలో మీడియాతో మాట్లాడిన దీప్కే.. జార్ఖండ్‌లో విద్యార్థుల ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న దేవేంద్ర మహతోతో తాను మాట్లాడినట్లు చెప్పారు. తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ పోలీసులు ఆయనపై లాఠీచార్జ్ చేశారని మహతో తనతో చెప్పినట్లు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. దేశంలోని అన్ని ప్రభుత్వాలు విద్యార్థులపై ఇలాంటి దమనకాండకు పాల్పడటం ద్వారా ఏం సాధిస్తున్నాయో ఆలోచించాలని ఆయన సూచించారు. విద్యార్థులపై ఇలాంటి క్రూరత్వం జరగకూడదని హెచ్చరించారు. దేవేంద్ర మహతోకు తమ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చామని, జార్ఖండ్‌లో తమ బృందం విద్యార్థులతో కలిసి పనిచేస్తోందని అభిజీత్ దీప్కే తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కీలక పిలుపునిచ్చారు. ఆగస్టు 15 నుండి గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దేశవ్యాప్తంగా సీజేపీ తరపున మరో ఉద్యమం చేస్తున్నట్లు పిలుపునిచ్చారు. గ్రామీణ విద్యార్థులకు పట్టణాలతో సమానంగా మెరుగైన వసతులు కల్పించడమే తమ లక్ష్యమని దీప్కే వెల్లడించారు. పౌరులు, తల్లిదండ్రులు, సర్పంచులు కలిసి ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచాలని పిలుపునిచ్చారు.మహారాష్ట్రలోని హింగోలిలో తన స్వగ్రామం నుంచే ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్‌ను కలిసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్, సురక్షిత తాగునీరు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం వంటి కనీస వసతులను తనిఖీ చేయాలని తల్లిదండ్రులకు దీప్కే సూచించారు. పాఠశాలల్లో వసతుల కొరత ఉంటే ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ ఆడిట్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఆడిట్ ఫారమ్‌లో వివరాలు, వీడియోలను **contact@cockroachjantaparty.org**కు పంపవచ్చని తెలిపారు.

## పందుల యజమానులకు సీఐ వేణుగోపాల్ కౌన్సిలింగ్.



**దేవనకొండ ఆగస్టు 11 స్ఫూర్తి న్యూస్:** మండల కేంద్రంలో విచ్చల విడిగా పందుల సంచారంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యం లో పందుల యజమానులతో సీఐ వేణుగోపాల్ కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.గ్రామంలో పందులను బహిరంగంగా వదిలేయకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించినట్లు పేర్కొన్నారు. పందుల సంచారం వల్ల పారిశుధ్య సమస్యలు, ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున యజమానులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.అలాగే పోలీసుల సూచనలను పాటించకుండా పందులను రోడ్లపై, జనావాసాల మధ్య వదిలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం. గ్రామ పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తీసుకుంటున్న చర్యలకు పందుల యజమానులు సహకరించాలని సీఐ వేణుగోపాల్ కోరినట్లు తెలిపారు.

## నల్లచెలిమలలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం.



**దేవనకొండ ఆగస్టు 11 స్ఫూర్తి న్యూస్:** ఆలూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి శ్రీమతి వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లచెలిమల గ్రామంలో 'ఇంటింటా తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి మై టిడిపి యాప్‌లో ప్రజల వివరాలను నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు శాంతకుమార్ గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, లక్ష్మీనరసింహుడు, క్లస్టర్ ఇన్‌చార్జి దినకర్, కో-క్లస్టర్ ఇన్‌చార్జి కురువ జయరాం, కోల రంగన్న, కమ్మ హనుమప్ప, కమ్మ నరసింహుడు, కురువ రంగస్వామి, నాగరాజు, భరీగల శాంతకుమార్, ముక్కెళ్ల రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

### వారందరికీ లేని ఇబ్బంది జగన్‌కు

## ఎందుకు భాజపా అధికార ప్రతినిధి

తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారం అత్యంత దురదృష్టకరమైన విషయమని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ అన్నారు. గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు."వైకాపా పాలనలో జగన్ ఇతర మతస్థులను తితిదే ఛైర్మన్లుగా నియమించారు. హిందువులు పవిత్రంగా భావించే ప్రసాదంలో కల్తీ చేయటం దారుణం. కల్తీ జరిగిన విషయం ల్యాబ్ రిపోర్టులు తేటతెల్లం చేస్తున్నాయి. జగన్ పాలనలో తిరుమలకు వచ్చే భక్తులను దోపిడీ చేశారు. 18 సార్లు కల్తీ నెయ్యి వెనక్కి పంపామని చెప్పిన జగన్.. ఆ కంపెనీలపై ఎందుకు చర్యలు తీసుకోలేదు..?కూటమి ప్రభుత్వం ఈ విషయం బయట పెట్టాక.. ధర్మారెడ్డి ఎందుకు బయటకు రాలేదు?అప్పుడు ఈవోగా ఉండి టెండర్లు ఖరారు చేసిన ఆయన ఇప్పుడు వాస్తవాలు ఎందుకు చెప్పటం లేదు? తిరుమల దర్శనానికి డిక్లరేషన్‌పై సంతకం చేయకుండా జగన్ ఎందుకు పారిపోయారు..? మీరు విదేశాలకు వెళ్లాలంటే వీసా అడుగుతారు కదా""జగన్ తిరుమలకు వెళ్లి మత విద్వేషాలు రెచ్చగొట్టాలని చూశారు. దళితులను రెచ్చగొట్టి గొడవలు పెట్టాలని కుట్ర పన్నారు. గతంలో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం, సోనియా గాంధీ కూడా డిక్లరేషన్ ఇచ్చారు. పఠాన్ సినిమా విజయం సాధించిన తర్వాత షారూఖ్ ఖాన్ కూడా డిక్లరేషన్ ఇచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. వారందరికీ లేని ఇబ్బంది జగన్‌కు ఎందుకు..?" అని ప్రశ్నించారు.దళిత సమస్యగా చూపడం సబబు కాదు: డొక్కా మాణిక్య వరప్రసాద్ గుంటూరు: కలియుగ దైవం తిరుమలలో నియమాలు పాటించాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. తితిదే ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిసిందని ఆరోపణల నేపథ్యంలో వివాదం తలెత్తిందని.. దేశవాళీ ఆవు నెయ్యి వాడాలని డిమాండ్ చేశారు. జగన్ వ్యక్తిగత సమస్యను దళిత సమస్యగా చూపడం సబబు కాదని మండిపడ్డారు. "సమాజానికి దళితులను దూరం చేసిన వ్యక్తి జగన్. అధికారం కోల్పోవడంతో ఇప్పుడు దళితులు మీకు గుర్తొచ్చారా..? వాళ్లు స్వేచ్ఛగా దేవాలయాల్లో దర్శనం చేసుకుంటున్నారు" అని డొక్కా అన్నారు.

## వేగంగా పెరుగుతున్న వైద్య ఖర్చులు ఆసక్తికర నివేదిక

దేశంలో వైద్య ఖర్చులు మరింత భారంగా మారుతున్నాయి. ద్రవ్యోల్బణం కారణంగా వీటి వ్యయం వార్షికంగా 14శాతం మేర పెరుగుతోంది.ఇది కుటుంబాలపై ఆర్థిక భారం కానుంది. ఈవిషయాన్ని %ాజఖా% ఇండియా హెల్త్ ఇన్సూరెన్స్ ఇండెక్స్ 2024 నివేదికలో వెల్లడించింది. దీంతోపాటు పలు ఆసక్తికర విషయాలను ఈ నివేదిక విడుదల చేసింది.విడుదల చేసిన నివేదిక ప్రకారం.. చాలామంది ఆసుపత్రి ఖర్చుల్లో 23శాతం మొత్తాన్ని రుణాల ద్వారా తీరుస్తున్నారట. దీంతో ఈ కుటుంబాలపై తీవ్ర ఆర్థికభారం పడుతోంది. ఆరోగ్య సంరక్షణ ఖర్చుల్లో 62 శాతాన్ని జేబుల నుంచి స్వయంగా వెచ్చిస్తున్నారని తెలుస్తోంది. అనుకోకుండా వచ్చే అనారోగ్య సమస్యల నుంచి బయపడేందుకు మెరుగైన ఆరోగ్య కవరేజీ ముఖ్యమని ఈ నివేదిక అభిప్రాయపడింది.

### బ్లాక్ టికెట్ల వ్యవహారం.. బుక్ మై షో సీఈవోకు సమన్లు

దిల్లీ ఎన్‌సీఆర్‌లోనే కిడ్నీకి సంబంధించి ఎక్కువగా క్లెయిమ్‌లు నమోదయ్యాయని నివేదిక తెలిపింది. ఆ తర్వాత కొచ్చి, సికింద్రాబాద్, బెంగళూరు, జైపుర్.. నగరాల్లో కిడ్నీ సంబంధిత క్లెయిమ్‌ల సంఖ్య సగటు కంటే అధికంగా ఉందని వెల్లడించింది. కిడ్నీ సమస్యతో బాధపడుతున్నవారి సగటు వయసు 47 కాగా.. ఈ సమస్య కారణంగా అందించిన చికిత్సతో నమోదైన బిల్లు మొత్తం ఒక్కరికి గరిష్ఠంగా రూ.24,73,894గా ఉందని తెలిపింది.కలకత్తా, ముంబయి నగరాల్లో మరీ ముఖ్యంగా 31-35 మధ్య వయసున్నవారు ఎక్కువగా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. క్యాన్సర్ రేటు రానున్న ఏళ్లలో పెరిగే అవకాశం ఉందని నివేదిక తెలిపింది. 2020 నుంచి 2025 నాటికి క్యాన్సర్ కేసులు 13శాతం పెరగొచ్చని అంచనా వేసింది. ఇదిలాఉండగా.. తాజాగా కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని 70ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు కలిగిన సీనియర్ సిటిజన్లందరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా కింద బీమా కవరేజ్ అందిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఆర్థికస్థితితో సంబంధం లేకుండా రూ.5 లక్షల వరకు ఉచిత చికిత్స సౌకర్యాన్ని పొందొచ్చు.

## బీరుట్‌ను విడిచి వెళ్లిపోండి హెచ్చరించిన ఇజ్రాయెల్

హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ దాడి కొనసాగుతుంది. ఈ తరుణంలో బీరుట్‌లోని దాహియాతో పాటు పొరుగుప్రాంత ప్రజలు తమ ఇళ్లను వదిలి పెట్టి వెళ్లాలని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ హెచ్చరికలు జారీ చేసింది.ఈమేరకు ఎక్స్ (ట్విట్టర్)లో ఓ వీడియోని పోస్ట్ చేసింది. 'మా యుద్ధం హెజ్‌బొల్లాతో కానీ.. లెబనాన్ ప్రజలతో కాదు.. ఇజ్రాయెల్ పౌరులే లక్ష్యంగా హెజ్‌బొల్లా దాదాపు 1,50,000 రాకెట్లను లెబనాన్‌లో దాచింది.. వాటిల్లో కొన్ని వ్యూహాత్మకంగా పౌరులు నివసించే ఏరియాల్లో ఉంచింది.. కాబట్టి తాము ఆ ప్రాంతాలను నిర్వీర్యం చేయాలని నిర్ణయం తీసుకున్నాం.. కావునా, ప్రజలు వెంటనే ఆ ప్రాంతాలను వదిలివెళ్లండి అని ఐడీఎఫ్ వెల్లడించింది.అస్సాంలో బంగ్లాదేశీయులపై చర్యలు.. బహిష్కరించిన వారి లెక్కలు చెప్పిన సీఎం కాగా, ఉత్తర ఇజ్రాయెల్‌లోని పౌరులను హెజ్‌బొల్లా టార్గెట్ గా చేసుకున్నట్లు ఐడీఎఫ్ అధికారి తెలిపారు. లెబనాన్ నుంచి ప్రయోగించిన రాకెట్‌తో ఆ ఏరియా మొత్తం దెబ్బతిన్నట్లు పేర్కొన్నాడు. తమ పౌరులను లక్ష్యంగా చేసుకున్న హెజ్‌బొల్లా నుంచి తమ దేశ ప్రజలను రక్షించుకుంటామన్నారు. ఇదిలాఉండగా.. లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఈ దాడిలో 300 మంది మరణించినట్లు అక్కడి మీడియా ఓ కథనం ప్రసారం చేసింది. ఈ దాడుల్లో హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా కూడా చనిపోయినట్లు సమాచారం. అయితే, ఈ విషయాన్ని హెజ్‌బొల్లా వర్గాలు ఇప్పటి వరకు ధ్రువీకరించలేదు.

## తెలంగాణకు జేపీ నడ్డా రాక అధ్యక్షుడిపై క్లారిటీ రానుందా

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఇవాళ తెలంగాణకు రానున్నారు. సాయంత్రం ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి నేరుగా ఐటీసీ కాకతీయకు వెళ్లి కాసేపు విశ్రాంతి తీసుకోనున్నారు.అనంతరం సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అక్కడి నుండి హరిత ప్లాజాకు వెళ్తారు. అక్కడ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాష్ట్ర పదాధికారులతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు, స్థానిక సంస్థల ఎన్నికల సమాయత్తంపై ఆరా తీయనున్నారు. ఖైరతాబాద్‌లో సభ్యత్వ నమోదు క్యాంపెయిన్‌లో పలువురికి స్వయంగా సభ్యత్వాన్ని ఇవ్వనున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. అనంతరం రాత్రికి ఢిల్లీకి తిరుగు ప్రయాణం అవుతారు.

# విరుపాక్షి అరెస్టును ఖండించిన - వైసీపీ



- వెంటనే విడుదల చేయాలి..
కూటమి ప్రభుత్వానికి కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు హెచ్చరిక

**ఆలూరు, ఆగస్టు 11 (స్ఫూర్తి పత్రిక):** ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బూసినే విరుపాక్షి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాలంటరీ విభాగం సంయుక్త కార్యదర్శి కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు అన్నారు. మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా దివాకర్ నాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షిని అరెస్టు చేయడం సరికాదన్నారు. అరెస్టులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరని స్పష్టం చేశారు. ప్రజల కోసం పోరాడే నాయకుడికి పార్టీ శ్రేణులు, ప్రజలు అండగా ఉంటారని అన్నారు.కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే నాయకులపై కేసులు, అరెస్టులతో అణచివేతకు ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. లిఎమ్మెల్యే విరుపాక్షిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.విరుపాక్షి విడుదలయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని దివాకర్ నాయుడు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజల సమస్యలపై మరింతగా ప్రజల్లోకి వెళ్లి పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. అరెస్టులు, బెదిరింపులకు కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ప్రజల కోసం పోరాడుతున్న నాయకుడికి అండగా కార్యకర్తలు, ప్రజలు నిలుస్తారు. న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు అని దివాకర్ నాయుడు పేర్కొన్నారు.

# ఫ్రీ జోన్ తీర్పు.. 'జైల్ భరో'కు పిలుపు




1. 14 (ఎఫ్)ను రద్దు చేయాలని కోరుతూ 2009, అక్టోబర్ 21న సిద్దిపేటలో ఉద్యోగ గర్జన నిర్వహించారు

2. కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 14 (ఎఫ్) అధికారికంగా రద్దు చేస్తున్నట్లు కేంద్రప్రభుత్వం 2011, ఆగస్టు 12న ప్రకటించింది పై వాక్యాల్లో సరైనది/సరికానిది ఏది?14(ఎఫ్)ను రద్దు చేయాలని ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేయడంతో నాటి ముఖ్యమంత్రి రోశయ్య 2009, అక్టోబర్ 19న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు.

14(ఎఫ్)ను రద్దు చేయాలని కోరుతూ 2009, అక్టోబర్ 21న సిద్దిపేటలో ఉద్యోగ గర్జన నిర్వహించారు.

ఉద్యమ తీవ్రతను గ్రహించిన రోశయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర అసెంబ్లీ 14(ఎఫ్)తొలగిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసింది.

దీని తర్వాత కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్న కాలంలో 14 (ఎఫ్) అధికారికంగా రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం 2011, ఆగస్టు 12న ప్రకటించింది.

1. హైదరాబాద్ ఫ్రీజోన్ తీర్పునకు వ్యతిరేకంగా ఇందిరాపార్క్ వద్ద ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించారు

2. ప్రత్యేక రాష్ట్రంపై నిర్ణయం తీసుకోకపోతే నవంబర్ 29 నుంచి ఆమరణ నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు కేసీఆర్ మరోసారి ప్రకటించారు పై వాక్యాల్లో సరైనది/సరికానిది ఏది?హైదరాబాద్ ఫ్రీజోన్ తీర్పునకు వ్యతిరేకంగా ఇందిరాపార్క్ వద్ద ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కేసీఆర్ హాజరయ్యారు. తర్వాత కేసీఆర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ప్రత్యేక రాష్ట్రంపై నిర్ణయం తీసుకోకపోతే నవంబర్ 29 నుంచి ఆమరణ నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు కేసీఆర్ మరోసారి ప్రకటించారు

39. కింది వాక్యాలను పరిశీలించండి.

1. 1997, జనవరి 19న హైదరాబాద్‌లోని వివేకవర్ధిని కాలేజీ దగ్గర ఉన్న అశోక్ టాకీస్‌లో తెలంగాణ సంస్కృతి వివక్షపై ఒక సదస్సు జరిగింది

2. ఈ సదస్సులో గద్దర్ తొలిసారి 'అమ్మా తెలంగాణమా %-% ఆకలి కేకల గానమా' గీతాన్ని పాడాడు

3. 1999, మార్చి 8న భువనగిరిలో తెలంగాణ సదస్సు జరపాలని ఈ సదస్సులోనే నిర్ణయం తీసుకున్నారు పై వాక్యాల్లో సరైనది/సరికానిది ఏది?

ఎ) 1 సరైనది బి) 2 సరైనది

సి) 1, 2 సరైనవి డి) పైవేవీ సరైనవి కావు

వివరణ : 1997, జనవరి 19న హైదరాబాద్ పుత్లీబౌలిలోని వివేకవర్ధిని కాలేజీ వద్ద ఉన్న అశోక టాకీస్‌లో తెలంగాణ సంస్కృతి వివక్షపై ఒక సభ జరిగింది. ఈ సభ నిర్వాహకుడు %-% పాశం యాదగిరి.పోలీసులు హత్య చేసిన గులాం రసూల్ స్మారకార్థం ప్రతి సంవత్సరం సభ నిర్వహించాలనే ఉద్దేశంతో ఇక్కడ తెలంగాణ జర్నలిస్టులు ఫోరం ఫర్ ఫ్రీడం ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అనే సంస్థను ఏర్పాటు చేసుకున్నారు.ఈ సంస్థ ఆధ్వర్యంలోనే ఈ సదస్సు జరిగింది. ఈ సదస్సు కరపత్రం మొదటి వాక్యమే 'సొంత గడ్డపై పరాయి బిడ్డలుగా బతుకుతున్న సోదరుల ఆత్మగౌరవ ఉద్యమం' అని పేర్కొన్నారు.ఈ సదస్సులోనే గాదె ఇన్నయ్య 'దగాపడ్డ తెలంగాణ' పుస్తక తొలి సంచిక ఆవిష్కరణ జరిగింది. ఈ సదస్సులోనే గద్దర్ తొలిసారి 'అమ్మా తెలంగాణమా.. ఆకలి కేకల గానమా' గీతాన్ని ఆలపించారు. 1997, మార్చి 8న భువనగిరిలో తెలంగాణ సదస్సు జరపాలని ఈ సదస్సులోనే నిర్ణయం తీసుకున్నారు.

40. నా తల్లి తెలంగాణ.. తిరగబడ్డ వీణ అనే పాటను ఎవరు పాడారు? ఈ సభలో గద్దర్ మొదటిసారి నా తల్లి తెలంగాణ.. తిరగబడ్డ వీణ పాటను పాడారు

41. నందిని సిధారెడ్డి నాగేటి సాళ్లల %-% నా తెలంగాణ నా తెలంగాణ పాటను ఏ సభలో పాడారు?

ఎ) సిద్దిపేట బి) సంగారెడ్డి

సి) కామారెడ్డి డి) భువనగిరి

వివరణ : 1997 ఆగస్టులో రచయితలు, ఉద్యోగులు కలిసి తెలంగాణపై సిద్దిపేట పట్టణంలో సదస్సు నిర్వహించారు.

ఈ సభ సమావేశంలోనే నందిని సిధారెడ్డి నాగేటి సాళ్లల్ల.. నా తెలంగాణ నా తెలంగాణ పాట పాడారు.

42. సూర్యాపేట డిక్లరేషన్‌లోని అంశాల గురించి కింది వాక్యాలను పరిశీలించండి.

1. హైదరాబాద్ సహా 10 జిల్లాలతో కూడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలి

2. 1956, నవంబర్ 1 నుంచి ఇప్పటిదాకా ప్రభుత్వం తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు ఏయే రంగానికి ఎంతెంత నిధులు కేటాయించిందో శ్వేతపత్రంలో ప్రకటించాలి

3. ఆంధ్రాలో తలపెట్టిన పోలవరం, పులిచింతల ప్రాజెక్టులను తక్షణమే రద్దు చేయాలి

4. రైతాంగం, గిరిజనులు పోడు చేసుకుంటున్న పట్టాల్లేని అన్ని రకాల భూములపై వెంటనే బేషరతుగా పట్టాలివ్వాలి పై వాక్యాల్లో సరైనది/సరికానిది ఏది?

ఎ) 1, 2 సరైనవి బి) 2, 4 సరైనవి

సి) 3 సరైనది డి) 1, 3, 4 సరైనవి

వివరణ : సూర్యాపేట డిక్లరేషన్‌లోని అంశాలు

1. హైదరాబాద్ సహా 10 జిల్లాలతో కూడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలి

2. 1956, నవంబర్ 1 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ఏయే రంగానికి ఎంతెంత నిధులు కేటాయించిందో శ్వేతపత్రంలో ప్రకటించాలి

3. ఆంధ్రాలో తలపెట్టిన పోలవరం, పులిచింతల ప్రాజెక్టులను తక్షణం రద్దు చేయాలి. తెలంగాణ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న సాగుకు ఉద్దేశించిన అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు తక్షణం నిధులు కేటాయించాలి

4. రైతాంగం, గిరిజనులు పోడు చేసుకుంటున్న పట్టాల్లేని అన్ని రకాల భూములకు వెంటనే బేషరతుగా పట్టాలివ్వాలి. రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్స్‌ను అనుసరించి ఏజెన్సీ ప్రాంతాలను గిరిజన స్వయం ప్రాంతాలుగా ప్రకటిస్తూ చట్టం చేయాలి. 1/70 చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు జరిపి గిరిజనేతరుల స్వాధీనంలోని గిరిజన భూములన్నీ వెంటనే గిరిజనులకు ఇప్పించాలి

5. తెలంగాణ గ్రామాల్లో జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను, రాజ్యహింసను తక్షణమే నిలిపివేయాలి. అన్ని రకాల పోలీసు బలగాలను తెలంగాణ గ్రామాల నుంచి తక్షణం వెనక్కి పంపించాలి.

6. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో అమాయక ప్రజలపై నక్సలైట్లు అనే నెపంతో అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలి.

7. ప్రభుత్వ రంగంలోని మూసివేయాలనుకున్న పరిశ్రమలకు, నష్టాలతో నడుస్తున్న పరిశ్రమలకు అదనపు నిధులు కేటాయించి కార్మికులకు యాజమాన్యంలో, నిర్వహణలో భాగస్వామ్యం కల్పించాలి.

8. తెలంగాణలోని అన్ని విద్యాసంస్థల్లో 100 శాతం సీట్లను స్థానిక విద్యార్థులకే కేటాయించాలి.

9. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్తును తెలంగాణ ప్రజల అవసరాలకే వినియోగించాలి

10. తెలంగాణలోని అన్ని రకాల పరిశ్రమల్లో, ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల్లో స్థానికులనే నియమించాలి

11. తెలంగాణలో స్వయం ఉపాధి అవకాశాలను చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమల ఏర్పాటు కోసం తెలంగాణలోని వివిధ సామాజిక వర్గాలకు దామాషా పద్ధతిపై లైసెన్స్, రుణాలను ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుంచి నేరుగా మంజూరు చేయాలి

12. మైనారిటీ వర్గాలకు చెందిన ప్రజల భాషా, సాంస్కృతిక, ఆర్థిక వికాసానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి

13. భాషాభివృద్ధిలో భాగంగా తెలంగాణలోని విద్యాసంస్థల్లో అధికార యంత్రాంగం పరిపాలనా రంగంలో, న్యాయవ్యవస్థలో, మీడియాలో తెలంగాణ ప్రజల భాషను ప్రవేశపెట్టాలి. తెలంగాణ ప్రాంతంవారే సభ్యులుగా ఉండే తెలంగాణ భాషాభివృద్ధి బోర్డును నెలకొల్పాలి.

14. తెలంగాణ ప్రాంతంలోని గిరిజన భాషలను క్రమపద్ధతిలో అభివృద్ధి చేయడానికి, లిపి లేని భాషలకు ప్రత్యేకమైన లిపిని తయారు

చేయడానికి గిరిజన కళలను, సంస్కృతిని చరిత్రను ప్రాంతాల వారీగా సమగ్రంగా అధ్యయనం చేసి అభివృద్ధి చేయడానికి ఒక ప్రత్యేక బోర్డును నియమించాలి

15. తెలంగాణలోని విద్యాసంస్థల్లో బోధిస్తున్న పాఠ్యాంశాల్లో వివిధ సామాజిక వృత్తులకు సంబంధించి నైపుణ్యం, శ్రమపై గౌరవభావం కలిగించే అంశాలను సాంఘికంగా అణిచివేయబడుతున్న పీడిత కులాల చారిత్రక నేపథ్యం, సంస్కృతి, జీవన విధానాన్ని శాస్త్రీయ దృష్టితో, ప్రజాస్వామిక దృక్పథంతో వివరించే అంశాలను చేర్చాలి.

16. తెలంగాణ ప్రాంత ప్రజల సామాజిక వెనుకబాటుతనాన్ని రూపుమాపి అన్ని రంగాల్లో వారిని అభివృద్ధి చేసే విధంగా సామాజిక న్యాయసూత్రాలకు అనుగుణంగా ఆర్థిక

విధానాన్ని రూపొందించి అమలు చేయాలి.

# ఒక పేగు మరో పేగులోకి చొరబడితే..

మా అబ్బాయి వయసు తొమ్మిది నెలలు. అప్పుడప్పుడు.. ఒక్కసారిగా ఏడ్వడం మొదలుపెడతాడు. అప్పుడు బాగా ఇబ్బందిపడతాడు. ఓసారి హాస్పిటల్‌కి తీసుకుపోయాం. గ్యాస్ట్రిక్ సమస్య ఉందేమోనని మందులు ఇచ్చారు. కొంత ఉపశమనం ఉంది. కానీ, మళ్లీ మళ్లీ అలానే అవుతున్నది. కొన్నాళ్ల తర్వాత మలంలో రక్తం పడటం గమనించాం. కంగారుపడి హాస్పిటల్‌కి వెళ్లాం. స్కాన్ చేసి పేగులు మడతపడ్డాయని చెప్పారు. మా అబ్బాయికి ఇన్‌టుససెప్షన్ సమస్య ఉందని చెప్పారు. వెంటనే ఆపరేషన్ థియేటర్‌కి తీసుకుపోయారు. కొంత ప్రొసీజర్ చేసి తగ్గించారు. ఇలా ఎందుకు జరిగింది. మళ్లీ ఈ సమస్య రావచ్చా?ఆరు నెలల నుంచి ఏడాదిలోపు పిల్లల్లో పేగు ఒక భాగం ఇంకొక భాగంలోకి వెళ్తుంది. దానిని ఇన్‌టుససెప్షన్ అంటారు. ఒక పేగు మరో పేగులోకి పోతే ఆ చొచ్చుకుపోయిన భాగంలో రక్త సరఫరా నిలిచిపోతుంది. అందుకే రక్తం కలిసిన మలం పడుతున్నది. ఇలా పడటాన్ని వైద్య పరిభాషలో రెడ్ కరెంట్ జెల్లీ స్టూల్ అంటారు. కొన్నిసార్లు ఈ సమస్య దానంతట అదే తగ్గిపోవచ్చు. అలా తగ్గకపోతే ఆపరేషన్ థియేటర్‌లో హైడ్రోస్టాటిక్ ప్రెజర్ చేస్తారు. ఈ పద్ధతిలో పేగుల్లోకి ద్రవాలను పంపి, పీడనం పెంచడం ద్వారా చొచ్చుకుపోయిన పేగులను సరిచేస్తారు. ఇలాచేసిన తర్వాత ఆ సమస్య మళ్లీ వచ్చే ప్రమాదం తక్కువ. కానీ, అసలే రాదని చెప్పలేం.చిన్న పేగులు అన్నీ కూడా ట్యూబుల్లా ఉంటాయి. ఒక భాగం ఇంకో భాగంలోకి పోయినప్పుడు పేగులు టెలిస్కోప్‌లోని పైపుల్లా ఉంటాయి. ఇలా అయినప్పుడు పేగుల్లో పైనుంచి కిందికి పోవాల్సిన ఆహార పదార్థాలు చలనం




లేకుండా నిలిచిపోతాయి. ఆ సందర్భంలో వాంతి అవుతుంది. టెలిస్కోపింగ్ వల్ల రక్త సరఫరా తగ్గిపోతుంది. దీనివల్ల ఇన్‌టుససెప్షన్ జరుగుతుంది. ఇలా ఎందుకు జరుగుతుందో కొన్నిసార్లు కారణం తెలియదు. కానీ కొన్నిసార్లు లక్షణాల ఆధారంగా సమస్యను ముందే తెలుసుకోవచ్చు. కడుపు ఉబ్బరం, మళ్లీ మళ్లీ ఏడ్వడం, వాంతులు, మలంలో రక్తం, నీరసం%ౌ% ఈ లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి. కొందరు వైరస్ ఇన్ఫెక్షన్ వల్ల ఈ సమస్య బారినపడతారు. ఇలాంటప్పుడు పేగుల్లో ఉండే గ్రంథుల్లో వాపు సంభవిస్తుంది. దీనివల్ల ఒక పేగులోకి మరో పేగు చొచ్చుకుపోయే ప్రమాదం ఉంది.

# ప్రజలకు కాంగ్రెస్ కరెంట్ షాక్



తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ సరఫరా లేక అంధకారంలో మగ్గవలసి వస్తుందని ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రజలను భయపెట్టారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ హయాంలో నిత్యం విద్యుత్ కోతలతో సతమతమయ్యారు. అనేక చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయి. ఎంతోమంది ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ సర్కార్ మొదట విద్యుత్‌రంగంపైనే దృష్టి సారించింది. ఈ క్రమంలోనే పదేండ్ల పాటు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సుపరిపాలనను అందించింది. అయితే, ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను అమలుచేయకపోగా ఇప్పుడు ప్రజలకు కరెంట్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతుండటం ఆందోళనకరం. పరాయి పాలకుల హయాంలో కరెంటు సమస్యలతో అతలాకుతలమైన తెలంగాణ ప్రాంత ప్రజలు పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఊపిరి పీల్చుకున్నా రు. కేసీఆర్ హయాంలో విద్యుత్‌రంగ స్వరూపమే మారిపోయింది. ప్రణాళికా బద్ధంగా కేసీఆర్ చేపట్టిన చర్యలతో విద్యు త్తు కోతలకు అడ్డుకట్ట పడింది. విద్యుత్తు ఉత్పాదనలో తెలంగాణ మిగులు రాష్ట్రం గా అవతరించింది. అయితే, రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో ఒక్కసారిగా విద్యుత్ సంక్షోభం తలెత్తింది. విద్యుత్ ఉత్పాదన, నిర్వహణా లోపాల కారణంగా కోతలు పునరావృతమవుతున్నాయి. అయితే, ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్ చార్జీల పెం పుతో పెనుభారం మోపేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధపడుతుండటం ఆందోళనకరం. ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించి గద్దెనెక్కిన కాంగ్రెస్.. ప్రజలు హామీలు అమలుచేయాలని ఒత్తిడి చేస్తుండటంతో వారిపై రకరకాల పన్నుల భారాన్ని మోపుతున్నది. తెలంగాణలోనే కాకుండా కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ అక్కడి ప్రభుత్వాలు దొడ్డిదారిన ప్రజలపై భారం మోపుతున్నాయి. గ్యారెంటీలను అమలుచేయలేక కుంటిసాకులతో కాలయాపన చేస్తున్నాయి. ఒక ప్రణాళిక లేని పాలనతో తప్పటడుగులు వేస్తున్న కాంగ్రెస్ సర్కార్ విద్యుత్ చార్జీలు పెంచాలనే ప్రతిపాదనలను తెరపైకి తీసు కువచ్చింది. తద్వారా ప్రజలపై రూ.18, 500 కోట్ల మేర అదనపు భారం పడే అవ కాశాలున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో రూ.14,222 కోట్లు ఆదాయలోటు ఉన్నదని డిస్కంలు విద్యుత్ నియంత్రణ మండలిలో పిటిషన్ దాఖలు చేశాయి. ఉత్పత్తి సంస్థల నుంచి కొనుగోలు చేస్తున్న కరెంట్‌కు, వినియోగదారులకు పంపిణీ చేస్తున్న కరెంటుకు మధ్య భారీ లోటు ఉన్నదని, దాన్ని పూడ్చేందుకుగాను చార్జీల పెంపునకు అవకాశమివ్వాలని ఈఆర్సీకి విన్నవించాయి. అయి తే, వాస్తవ రెవెన్యూ వ్యత్యాసం రూ.5,95 8 కోట్లు మాత్రమే ఉంటుందని ఎస్పీడీసీఎల్ అంచనా వేస్తుండటం గమనార్హం. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ఇప్పటికే వ్యవసాయరంగం మొదలుకొని పారిశ్రామికరంగం వరకు అన్నిరంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయి. ఈ దశ లో విద్యుత్ చార్జీల పెంపు సరికాదని, ప్రతిపాదనలను తిరస్కరించాలని విద్యుత్ నియంత్రణ మండలికి బీఆర్ఎస్ విజ్ఞాప న పత్రం అందజేసింది. పారిశ్రామికరంగానికి సంబంధించి అన్ని క్యాటగిరీలకు ఒకేరకంగా చార్జీలు వసూలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అంతేకాదు, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరవాలనే కుట్ర చేస్తున్నది. హైటెన్షన్ (హెచ్‌టీ) వినియోగదారులకు 11 కేవీ కనెక్షన్‌కు వసూలు చేస్తున్నట్టుగానే.. 33 కేవీ, 132 కేవీ కనెక్షన్లకు కూడా చార్జీలు వసూ లు చేయాలనే ప్రతిపాదనలున్నాయి. ప్రస్తుతం పరిశ్రమలకు సంబంధించి 11 కేవీ యూనిట్‌కు రూ.7.65, 33 కేవీకి రూ.7.15, 132 కేవీకి రూ.6.65 చొప్పు న డిస్కంలు వసూలు చేస్తున్నాయి. అయి తే, ఇకపై ఈ మూడు క్యాటగిరీలకు 11 కేవీ మాదిరిగానే యూనిట్‌కు రూ.7.65 చొప్పున వసూలు చేస్తే పరిశ్రమలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. పరిశ్రమలపైనే కాకుండా స్థిర చార్జీల పేరిట గృహ వినియోగదారులపై గుదిబండ మోపాలని కాంగ్రెస్ సర్కార్ చూస్తున్న ది. ఇండ్లల్లో వాడుకునే కరెంటు నెలకు 300 యూనిట్లు దాటితే కిలోవాట్‌కు ఫిక్స్ డ్ ఛార్జీ ప్రస్తుతం రూ.10 వసూలు చేస్తుండగా.. దాన్ని రూ.50కి పెంచాలని డిస్కం లు కోరాయి. అంటే ప్రజలపై ఐదు రెట్ల భారం పడనున్నది. 200 యూనిట్లలోపు వాడే వినియోగదారులకు గృహజ్యోతి పేరి ట ఉచిత కరెంటు ఇస్తామని చెప్పిన కాం గ్రెస్ సర్కారు లబ్ధిదారుల సంఖ్యలో భారీ గా కోత పెట్టింది. గతంలో ఎన్ని కష్టాలు ఎదురైనా కేసీఆర్ సర్కార్ ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని పడనీయలేదు. విద్యుత్ చార్జీలు పెంచాలని డిస్కంలు ప్రతిపాదనలు పంపి నా కేసీఆర్ ప్రభుత్వం అంగీకరించలేదు. అంతేకాదు, వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా అందించిన కేసీఆర్ సర్కార్ రూ.వేల కోట్ల భారాన్ని మోసింది. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదనను పదేండ్లలో మూడు రెట్లకు పైగా పెంచింది. విద్యుత్ రంగంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన విప్లవాత్మక మార్పు ల కారణంగా రాష్ట్రంలో ఉపాధి అవకాశా లు పెరిగాయి. పారిశ్రామికంగా రాష్ట్రం కొత్త పుంతలు తొక్కింది. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఒత్తి డి చేసినా కేసీఆర్ సర్కార్ అంగీకరించలే దు. అయితే, ఈ విషయమై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి తెలపాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ నిలదీసినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోహం చాటేశారు.

### విద్యుత్ చార్జీల పెంపునకు డిస్కంలు చూపుతున్న కారణాలు

సహేతుకంగా లేవని విద్యుత్‌రంగ నిపుణులు చెప్తున్నారు. విద్యుత్ ప్లాంట్లలో ఉత్పాదకత పడిపోతుండటంతో ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి వస్తున్నది. అసమర్థ నిర్వహణ, అసంబద్ధ విధానాల ఫలితంగానే ఈ దుస్థితి తలెత్తుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పారిశ్రామిక ప్రగతి మందగించిం ది. అందుకు విద్యుత్ సంక్షోభమే కార ణం. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా అనేక పరిశ్రమలు తరలిపోయాయి. డిస్కంలకు పరిశ్రమలే వెన్నెము క. కరెంటు చార్జీల పెంపుతో విద్యుత్ వ్యవ స్థ కుదేలవడంతో పాటు పారిశ్రామిక రం గం కూడా కుప్పకూలే ప్రమాదం ఉన్నది. పరిశ్రమలన్నింటినీ ఒకేగాటన కట్టే ప్రయ త్నం చేస్తుండటం కుటీర, చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమల పాలిట శాపంగా మార నున్నది. ఒకవేళ విద్యుత్ నియంత్రణ మండలి చార్జీల పెంపు ప్రతిపాదనలను ఆమోదిస్తే తెలంగాణలో మళ్లీ 2014 ముందున్న సంక్షోభ పరిస్థితులు తలెత్తుతాయి. విద్యు త్ కోతలు, చార్జీల పెంపు అంటే 'బంగారు తెలంగాణ'ను మరోసారి అంధకారంలోకి నెట్టివేయడమే. అసలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విద్యుత్‌రంగంపై స్పష్టమైన విధా నమంటూ ఏదీ లేదు. విద్యుత్ సమస్యల పై ప్రభుత్వం దాటవేత ధోరణిని అవలంబించడమే అందుకు తార్కాణం. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ చార్జీల విషయంటలో ఒంటెత్తు పోకడలకు పోయిన టీడీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. 2000లో చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీ లు పెంచి జలియన్ వాలాబాగ్ తరహాలో బషీర్‌బాగ్‌లో ఉద్యమకారులపై కాల్పులు జరిపింది. అప్పుడు డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కేసీఆర్ చార్జీల పెంపును తీవ్రంగా నిరసించారు. బాబు నిర్ణయాలతో ఏకీభవించని కేసీఆర్ అన్ని పదవులకు రాజీనామా చేసి టీడీపీ నుంచి బయటకు వచ్చారు. విద్యుత్ చార్జీల పెంపు విషయంలో ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడకపోతే ప్రజల నుంచి తీవ్రమైన ప్రతిఘటన ఎదురవడం తప్పదు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆ ఉద్యమాన్ని ముందుండి నడిపిస్తుంది. అందుకే, ప్రజలపై పెనుభారం మోపే చార్జీ ల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి.

# తైవాన్‌కు ఆయుధాలు విక్రయించేందుకు అమెరికా అంగీకారం తీవ్రంగా ఖండించిన చైనా



చైనా-తైవాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో తైవాన్‌కు 200 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాల విక్రయానికి అమెరికా అంగీకరించింది. ఈ ఒప్పందాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. వీటిని తక్షణం నిలిపివేయాలని కోరింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. తైవాన్‌కు అమెరికా ఆయుధాలు విక్రయించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొంది. 'తైవాన్‌కు అమెరికా ఆయుధాలు విక్రయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసుకోవాలి. తైవాన్ జలసంధిలో శాంతి, స్థిరత్వాన్ని దెబ్బతీసే ప్రమాదకరమైన చర్యలను వెంటనే ఆపాలి. చైనా తన జాతీయ సార్వభౌమాధికారం, భద్రత, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటుంది' అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొన్నది. మరోవైపు ఆయుధాల విక్రయంపై తైవాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సైతం స్పందించింది. చైనా బెదిరింపుల నేపథ్యంలో మాతృభూమిని రక్షించుకునే బాధ్యత తమకు ఉందని వెల్లడించింది. కాగా తైవాన్ తమ దేశంలో భాగమని బీజింగ్ ఎప్పటి నుంచో వాదిస్తోంది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఇటీవల తమ దేశం చుట్టూ 153 చైనా సైనిక విమానాలు చక్కర్లు కొట్టినట్లు తైవాన్ రక్షణశాఖ వెల్లడించింది. అంతేగాక యుద్ధానికి సిద్ధం కావాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తన దళాలకు పిలుపునిచ్చినట్లు ఆ దేశానికి చెందిన మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో తైవాన్‌కు 200 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాల విక్రయానికి అమెరికా అంగీకారం తెలిపింది. ఈ ఒప్పందం చైనాకు మింగుడు పడటంలేదు.

# కార్డియాక్ అరెస్ట్ వచ్చేందుకు నెల రోజుల ముందే ఈ లక్షణాలు కనిపిస్తాయి జాగ్రత్త పడండి



ప్రస్తుత తరుణంలో చాలా మంది కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోతున్న విషయం తెలిసిందే. కార్డియాక్ అరెస్ట్ అంటే గుండె పోటు అని అనుకుంటారు. అది నిజమే కానీ ఇది కాస్త భిన్నంగా ఉంటుంది. కార్డియాక్ అరెస్ట్ అంటే గుండెకు ప్రసారం అయ్యే పంపింగ్ వ్యవస్థ పనిచేయదు. ఇది జరిగిన మరుక్షణమే గుండె ఆగి మరణిస్తారు. ఇది హార్ట్ ఎటాక్ కు కాస్త భిన్నమైంది. ఇది చాలా ప్రమాదకరమైంది. ప్రస్తుతం చాలా మంది కార్డియాక్ అరెస్ట్ బారిన పడి వెంటనే చనిపోతున్నారు. అయితే ఇందుకు కారణాలు ఏమున్నప్పటికీ కార్డియాక్ అరెస్ట్ వచ్చేందుకు నెల రోజుల ముందే పలు లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

### తీవ్రమైన అలసట, నీరసం..

కార్డియాక్ అరెస్ట్ వచ్చేందుకు నెల రోజుల ముందే మనకు పలు సంకేతాలను శరీరం తెలియజేస్తుందట. వాటిని పసిగట్టడం ద్వారా జాగ్రత్త పడవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. కార్డియాక్ అరెస్ట్ వచ్చే ముందు తీవ్రమైన అలసటగా, నీరసంగా ఉంటుంది. చిన్న పని చేసినా చాలు తీవ్రంగా అలసిపోతారు. విపరీతమైన నీరసం ఉంటుంది. ఏమాత్రం చురుగ్గా ఉండరు. యాక్టివ్‌గా పనిచేయలేకపోతుంటారు. అడుగు తీసి అడుగు వేయడం కష్టమవుతుంది. ఈ లక్షణాలు కనిపిస్తున్నాయంటే మాత్రం దాన్ని కార్డియాక్ అరెస్ట్‌గా భావించాలి. వెంటనే డాక్టర్ ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి.

### శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది..

కార్డియాక్ అరెస్ట్ వచ్చే ముందు శ్వాస తీసుకోవడం కూడా ఇబ్బంది అవుతుంది. ఛాతిపై ఏదో బరువు పెట్టినట్లు అనిపిస్తుంది. శ్వాస ఆడడం కష్టంగా మారుతుంది. అదేవిధంగా ఛాతిలో అసౌకర్యంగా ఉంటుంది. ఇక గుండె కూడా అసాధారణ రీతిలో కొట్టుకుంటుంది. గుండె కొట్టుకునే వేగం బాగా పెరుగుతూ తగ్గుతూ ఉంటుంది. అలాగే పాదాలు, చేతుల్లో వాపులు కనిపిస్తాయి. అక్కడంతా నీరు చేరుతుంది. వేలితో టచ్ చేస్తే చర్మం లోపలికి పోతుంది. ఇలా గనుక ఎవరిలో అయినా లక్షణాలు కనిపిస్తుంటే వారికి కార్డియాక్ అరెస్ట్ రాబోతుందని తెలుసుకోవాలి. దీంతో వెంటనే జాగ్రత్త పడాలి. డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే టెస్టుల్లో తేలిపోతుంది. దీంతో డాక్టర్ సూచన మేరకు చికిత్స తీసుకుని ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఇక గుండె పోటు వచ్చే ముందు కూడా దాదాపుగా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. కాకపోతే గుండెపోటును కాస్త భిన్నంగా వైద్యులు చెబుతారు.

### గుండె పోటు వేరే..

రక్తనాళాల్లో ఏవైనా అడ్డంకులు ఏర్పడితే గుండె పోటు వస్తుంది. గుండె పోటు వచ్చిన వారిని మొదటి గంటలో జాగ్రత్తగా చూసుకుంటే వారు బతికే అవకాశాలు ఉంటాయి. కానీ కార్డియాక్ అరెస్ట్ అలా కాదు. ఇది వచ్చిందంటే మరణించాల్సిందే. కాబట్టి పైన తెలిపిన లక్షణాల పట్ల అందరూ జాగ్రత్తగా ఉండండి. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోండి. లేదంటే తరువాత బాధపడినా ప్రయోజనం ఉండదు.

# రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీళ్లను తాగాల్సిందే ఎందుకంటే



అధిక బరువును తగ్గించుకోవడం అన్నది ఎంత కష్టంగా ఉంటుందో అందరికీ తెలిసిందే. బరువు పెరగడం సులభమే. కానీ దాన్ని తగ్గించుకోవడం చాలా కష్టం. ఇందుకు గాను స్ట్రిక్ట్ డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. చిరు తిండి తినాలనే యావను తగ్గించుకోవాలి. ఆహారం తక్కువగా తినాలి. రోజూ వ్యాయామం చేయాలి. ఇలా పలు కఠిన నియమాలను పాటిస్తే గానీ బరువు తగ్గరు. అయితే దీంతోపాటు బరువును తగ్గించుకోవడంలో నీళ్లు కూడా ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. చాలా మంది బరువు తగ్గేందుకు కావల్సిన అన్ని మార్గాలను పాటిస్తారు. కానీ నీళ్లను సరిగ్గా తాగరు. వాస్తవానికి బరువును తగ్గించుకునేందుకు నీళ్లు కూడా ముఖ్య పాత్రను పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### మెటబాలిజం పెరుగుతుంది..

రోజూ కనీసం 3 నుంచి 4 లీటర్ల నీళ్లను అయినా తాగాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. నీళ్లను సరిగ్గా తాగితేనే ఎన్ని వ్యాయామాలు చేసినా, డైట్‌ను పాటించినా ఫలితం ఉంటుందని వారంటున్నారు. నీళ్లను సరిగ్గా తాగకుండా ఏం చేసినా వృథాయేనని బరువు అంతగా తగ్గరని వారు చెబుతున్నారు. కాబట్టి రోజూ తగినన్ని నీళ్లను తాగాల్సి ఉంటుంది. నీళ్లను రోజూ తగినన్ని తాగడం వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా కొవ్వు కరుగుతుంది. దీని వల్ల అధిక బరువు తగ్గుతారు. అకాడమి ఆఫ్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ అనే జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం రోజూ తగనన్ని నీళ్లను తాగడం వల్ల శరీర మెటబాలిజాన్ని పెంచుకోవచ్చని తేలింది. కనుక రోజూ తగినన్ని నీళ్లను తాగాల్సి ఉంటుంది.

### కొవ్వు కరుగుతుంది..

నీళ్లను రోజూ తగినన్ని తాగడం వల్ల శరీరంలో చేరే క్యాలరీలు కూడా తగ్గుతాయని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఒబెసిటీలో వెల్లడించారు. కాబట్టి రోజూ తగినన్ని నీళ్లను తాగితే బరువు తగ్గడం తేలికవుతుంది. నీళ్లను తాగడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది కూడా బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. నీళ్లను సరిగ్గా తాగితే శరీరం కొవ్వును మరింత సమర్థవంతంగా కరిగిస్తుంది. ఈ విషయాన్ని క్లినికల్ ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం అనే జర్నల్‌లో ప్రచురించారు.

### జీర్ణవ్యవస్థకు మంచిది..

నీళ్లను సరిగ్గా తాగడం వల్ల పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. దీంతో సుఖ విరేచనం అవుతుంది. మలబద్దకం నుంచి బయట పడవచ్చు. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఇలా జరిగితే బరువు తగ్గడం తేలికవుతుందని క్లినికల్ న్యూట్రిషన్ అనే జర్నల్‌లో వివరాలను ప్రచురించారు. కనుక ప్రతి ఒక్కరు తప్పనిసరిగా నీళ్లను సరిగ్గా తాగాల్సి ఉంటుంది. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీళ్లను అయినా సరే తాగాలని డాక్టర్లు చెబుతున్నారు. ఉదయం నిద్ర లేవగానే కనీసం 1 లీటర్ వరకు నీళ్లను తాగినట్లయితే రోజులో కావల్సిన నీళ్ల కోటాలో దాదాపుగా 25 శాతం పూర్తవుతుంది. మిగిలిన కోటాను రోజులో చాలా సులభంగా పూర్తి చేయవచ్చు. కాబట్టి బరువు తగ్గాలని చూస్తున్న వారు నీటి విషయంలో కూడా జాగ్రత్తలు పాటించడం మంచిది. లేదంటే ఎన్ని ప్రయత్నాలు చేసినా బరువు తగ్గలేరు. కనుక నీళ్లను రోజూ తప్పనిసరిగా తగినన్ని తాగాల్సి ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు.

# ప్రశ్నించే హక్కునూ కాలరాస్తరా



ముఖ్యమంత్రి రేవంత్ కార్యాలయంలో మూసీ నది సుందరీకరణ కోసం ఓ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 'మెయిన్‌హార్ట్' అనే సంస్థ పాల్గొన్నది. ఈ సమావేశ అనంతరం మూసీ నది సుందరీకరణ కోసం మెయిన్‌హార్ట్ సంస్థ ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి కార్యాలయం మీడియాకు ప్రకటించింది. అయితే, రాష్ట్ర ప్రజానీకం గమనించవలసిన ముఖ్య విషయం ఏమంటే%ౌ% 2024, జనవరి 22 నాడే మెయిన్‌హార్ట్ సంస్థతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుబాయ్‌లో పర్యటించారు. ఒక ప్రైవేట్ కంపెనీకి ఎలాంటి కాంట్రాక్టులు దక్కకముందే, ఎలాంటి సమావేశాలు జరగకముందే రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి ఆ ప్రైవేట్ కంపెనీ యజమానితో కలిసి విదేశీ పర్యటన చేయడం ఆశ్చర్యకరం. మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్ కోసం, కన్సల్టెంట్ సర్వీసుల ఎంపిక ప్రక్రియ కోసం నిర్వహించిన టెండర్లపై నాకే కాదు, రాష్ట్ర ప్రజలకు కూడా ఎన్నో సందేహాలు కలు గుతున్నాయి. ఈ టెండర్ ప్రక్రియను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే, కావాలనే 'మెయిన్‌హార్ట్' కంపెనీకి అప్పగించినట్టు అర్థమవుతున్నది. రాజకీయ నాయకుల జోక్యం కారణంగానే రేవంత్ ప్రభుత్వం టెండర్ నిబంధనలను ఉల్లంఘించిందనే ఆరోపణలకు బలం చేకూరుతున్నది. అందుకోసమే ప్రాజెక్టు వ్యయం రూ.50,000 కోట్ల నుంచి ఏకంగా రూ.1.50 లక్షల కోట్లకు పెరిగిందనే చర్చ రాష్ట్రంలో జరుగుతున్నది. అంతేకాదు, ముఖ్యమంత్రి రేవంత్ కూడా పదే పదే 'మెయిన్ హార్ట్' సంస్థ తరఫున ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ఈ కంపెనీని తానే ఎంపిక చేసినట్టు చెప్పడం కూడా టెండర్ నిబంధనలను ఉల్లంఘించడమే. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం మూసీ నదిని సుందరీకరణ చేయబోతున్నదని ప్రకటించారు. ఆ తర్వాతనే ఎంఆర్‌డీసీఎల్ అధికారులు మూసీ ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్ కోసం కంపెనీల ఎంపిక ప్రక్రియను చేపట్టారు. ఈ మేరకు ప్రభుత్వం ఆసక్తి గల కంపెనీల నుంచి ఫిబ్రవరి 5న టెండర్లను ఆహ్వానించింది. ఇందులో 10 కంపెనీలు బిడ్లు దాఖలు చేయగా, వాటితో ప్రీ బిడ్ మీటింగ్ నిర్వహించారు. తర్వాత టెండర్ల విషయంలో ఏడు కంపెనీలకు మాత్రమే టెక్నికల్‌గా అర్హత ఉన్నట్టు ప్రకటించారు. ఆ తర్వాత ఏప్రిల్ 10న రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ)ల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి, జూన్ 24ను ఆఖరి తేదీగా నిర్ణయించింది. అయితే, అర్హులైన ఏడు కంపెనీల్లో ఐదు కంపెనీలు మాత్రమే స్పందించి ఆర్ఎఫ్‌పీలను సమర్పించాయి. వాటిలో ఎస్ఏఐ కన్సల్టెన్సీ కంపెనీ అతి తక్కువకు బిడ్డింగ్ చేసింది. అయినప్పటికీ ఆరు నెలల తర్వాత సాంకేతిక కారణాలను ఉటంకిస్తూ, ఇతర వివరణలేవీ ఇవ్వకుండానే ఆర్ఎఫ్‌పీలను ఎంఆర్‌డీసీఎల్ రద్దుచేసింది. ఎంఆర్‌డీసీఎల్ రద్దుచేసిన ఈ తీరు పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ టెండర్‌లో సాయి కన్సల్టెన్సీ రూ.60 కోట్లకు అతితక్కువగా బిడ్ చేసిన కంపెనీ. ఆ తర్వాత వారం రోజులకు ముందే ప్రభుత్వం మరోసారి ఆర్ఎఫ్‌పీలను ఆహ్వానించింది. కానీ, ఆ సమయానికి కేవలం ఎల్ఈఏ అసోసియేట్స్, మెయిన్‌హార్ట్ కంపెనీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అందులో ఎల్ఈఏ కంపెనీ రూ.141 కోట్లకు బిడ్ దాఖలు చేయగా, మెయిన్‌హార్ట్ కంపెనీ రూ.143 కోట్లకు బిడ్ దాఖలు చేసింది. ఈ లెక్క ప్రకారం మూసీ సుందరీకరణ ప్రాజెక్టును ఎల్ఈఏ కంపెనీకే ఎంఆర్‌డీసీఎల్ అధికారులు అప్పగించాల్సి ఉన్నది. కానీ, వారం రోజుల తర్వాత సాంకేతిక కారణాలను చూపుతూ ఎల్ఈఏ కంపెనీని తిరస్కరించినట్టు మెయిన్‌హార్ట్ మాత్రమే పోటీలో మిగిలిందని ప్రభుత్వం చెప్పింది. ఆ తర్వాత రూ.141 కోట్ల బిడ్‌తో 'మెయిన్‌హార్ట్'ను ఎల్-1గా ప్రకటించారు. ఈ మూడు అంశాల నేపథ్యంలోనే మూసీ సుందరీకరణ ప్రాజెక్టు-మెయిన్‌హార్ట్ సంస్థ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు కారణమయ్యాయి. అందుకే, రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టు డీపీఆర్‌ను అందించగలిగే అనేక సంస్థలను ఆకర్షించడంలో ప్రభుత్వం ఎందుకు ఫెయిల్ అయింది? ఈ టెండర్లలో అధిక సంఖ్యలో కంపెనీలు పాల్గొనేలా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు? వంటి అనుమానాలు ప్రజల్లో సహజంగానే తలెత్తుతున్నాయి, తలెత్తాయి కూడా. అందుకే, ఇంత పెద్ద ప్రాజెక్టు ప్రాపర్టీ మేనేజ్‌మెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు వచ్చాయి. అయితే, పలు సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టులు తొలగించి, క్షమాపణలు చెప్పాలని 'మెయిన్‌హార్ట్' సంస్థ నాకు లీగల్ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. సదరు సంస్థ పంపిన లీగల్ నోటీసుల్లోనే తనపై ఉన్న ఆరోపణలను ఒప్పుకున్నది. అయితే ఈ సందర్భంగా మెయిన్‌హార్ట్ కంపెనీ గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకోవాల్సిన అవసరం ఉన్నది. పాకిస్థాన్‌లో జరిగిన రెండు భారీ కుంభకోణాలకు, మెయిన్‌హార్ట్ కంపెనీకి సంబంధాలున్నాయి. రావీ రివర్ ఫ్రంట్ కాంట్రాక్టులో లాహోర్ డెవలప్‌మెంట్ అథారిటీ వాళ్లు మెయిన్‌హార్ట్ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం వాటిలో ఒకటి కాగా, ఇండ్ల నిర్మాణానికి సంబంధించి జరిగిన రూ.3,000 కోట్ల కుంభకోణంలో ఈ కంపెనీకి ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయడం రెండ వది. కంపెనీ యజమానులు పరారీలో ఉన్న ట్లు ఆ నోటీసులో పేర్కొనడం గమనార్హం. ఇందుకు సంబంధించిన ఆధారాలు కూడా కోర్టు పత్రాల రూపంలో ఉన్నాయి. అంతేకాకుండా, పాట్నా విమానాశ్రయంలో మెయిన్ హార్ట్ కంపెనీ అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కూడా సదరు కంపెనీని బ్లాక్‌లిస్టులో పెట్టింది. వీటికి సంబంధించి ఆర్టీఐ ద్వారా బయటికి వచ్చిన సమాచారం, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వాళ్లు కోర్టుకు సమర్పించిన పత్రాలు కూడా ఉన్నాయి. ఝార?ండ్‌లో కాంగ్రెస్, జేఎంఎం పార్టీలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వం ఉన్నది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ ఇండియా కూటమిలో భాగస్వామి. అయినప్పటికీ హేమంత్ సోరేన్ కూడా మెయిన్‌హార్ట్‌పై సీబీఐ విచారణ కోరారు. అంతేకాదు, ఝార?ండ్‌లో కూడా మెయిన్‌హార్ట్ సంస్థ బ్లాక్‌లిస్ట్‌లో ఉండటం గమనించాల్సిన విషయం. ఒక బాధ్యత గల తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్‌లో నేను సోషల్ మీడియా కన్వీనర్‌గా కొనసాగుతున్నాను. మా పార్టీ తరఫున టీవీ చర్చల్లోనూ పాల్గొంటాను. అంతేకాదు, ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధన విద్యార్థిగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే తప్పుడు నిర్ణయాలను విశ్లేషించి ప్రశ్నించే హక్కును ప్రజాస్వామ్యం నాకు కల్పించింది. మూసీ నది సుందరీకరణ కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చవుతాయని సీఎం రేవంత్ రెడ్డి గతంలో ప్రకటించారు. ఆయన రాజకీయ బృందాలను వెంటపెట్టుకొని తెలంగాణ ప్రజల సొమ్ముతో దుబాయ్, లండన్, సియోల్ లాంటి నగరాల్లో కూడా పర్యటిస్తున్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే ఎలాంటి డీపీఆర్, డిజైన్ లేకుండానే పేద ప్రజల ఇండ్లను కూల్చివేస్తున్నది. ఒక రాష్ట్ర పౌరునిగా ఇందుకు సంబంధించిన ఏ అంశంలోనైనా ప్రభుత్వాన్ని, ప్రాజెక్టును చేపట్టిన మెయిన్‌హార్ట్ సంస్థను ప్రశ్నించే హక్కు నాకున్నది. అది నా బాధ్యత కూడా. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అనేది రాష్ట్రానికి సంబంధించిన అంశం. అలాంటి కాంట్రాక్టును ఇప్పటికే రకరకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న 'మెయిన్‌హార్ట్' సంస్థ దక్కించుకోవడం నన్ను విస్మయానికి గురిచేసింది. అందుకే సదరు కంపెనీకి సంబంధించిన గత చరిత్రను ప్రజలకు చెప్పదలచుకున్నాను. అందులో భాగంగానే ఈ తతంగాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశాను. అందుకే, రాష్ట్ర ప్రభుత్వం కేసులని, లీగల్ నోటీసులని నన్ను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నది. తెలంగాణ ఉద్యమంలోనే ఎన్నో కేసులను ఎదుర్కొన్న నన్ను ఇలాంటి కేసులు ఎలాంటి భయానికి గురిచేయవు. అలాచేయడం కూడా ఈ ప్రభుత్వానికి సరికాదు. ఇది ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే. తెలంగాణ ప్రజల తరఫున, మూసీ నది పరీవాహక ప్రాంతంలో నివసించే స్థానికుల పక్షాన ఎంతటి న్యాయ పోరాటానికైనా నేను సిద్ధం.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com